# వికృతి

ఈ కథ మానవేతర జీవియేదీ చదవకుండా జాగ్రత్త పడవలెను. ఈ కాగితాలు అట్టి జీవులకంటబడకుండా, పెన్‌డ్రైవ్ లోకో, సీడీలోకో యెక్కించి సీక్రెట్ పాస్‌వర్డ్ వంటివి పెట్టి తగు జాగ్రత్తలు తీసుకోవలెను.

ఇది కథకాదు. మానవేతర జీవరాశి జరుపదలచిన భీకర విధ్వంసానికి సంబంధించిన కుట్ర. ఈ కుట్ర మూడుచోట్ల, మూడుసభల్లో జరిగింది. కుట్ర అనగా ఒకరో, ఇద్దరో, ముగ్గురో రహస్యంగా చేసేది మాత్రమేననీ, అంతకెక్కువమంది చేసేది కుట్రకాదనీ, బహిరంగమనీ, దాన్ని కుట్ర అనటమే కుట్ర అనీ కొందరు మహానుభావులు కథలూ, కాకరకాయలూ రాస్తారు, కొందరేమో ఔనౌను, కొన్ని స్థలాలూ, కొన్ని సభలూ కుట్రలకు కేంద్రాలు, మన పార్లమెంటూ, అసెంబ్లీలలాగా అని వెటకరిస్తారు. ఈ బాపతు యెడ్డేమంటే, తెడ్డేమనే బాపతులెండి.

మూడుస్థలాల్లో, మూడు సభల్లో జరిగిన భాగోతం మీ ముందుంచుతాను, కుట్రో, కాదో మీరే తేల్చుకోండి. జరిగిన భాగోతాన్ని మొదటి సభనుంచి ఆరంభించాలిగానీ, మూడోసభ తీర్మానాలు నా లోలోపల గింగిర్లు తిరిగి, ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముందుగా

మూడుముక్కల్లోనైనా వాట్ని చెప్తేగానీ స్థిమితపడలేను.. హమ్మో.. ఏమి తీర్మానాలు, ఏమి ప్రతిజ్ఞలు, ఏమి పోరాట ఎత్తుగడలు, వ్యూహాలూ.. హమ్మో..!

గడ్డిపోచలు కత్తులయిపోతాయట! చెట్టూ, చేమా, కొమ్మారెమ్మల్తో కొట్టిచంపుతాయట! పిట్టా పిచుకా, పావురాళ్ళూ ఇండ్లను ఆక్రమిస్తాయట! మన ఎంగిలిమెతుకులు యేరుకునే కాకులూ– మన కళ్ళను పొడుచుకు తింటాయట! నక్కలూ, ఎలుగ్గొడ్లూ దోవలో నక్కి మనమీద పడతాయట! చిందువలూ, చిరుతలూ చీల్చుకుతింటాయట! పాములు పగబట్టి వెంటాడికాటువేస్తాయట! హమ్మో, ఇవీ అవీ, మనమీద ఎలాదాడి చేస్తామన్నాయో..? నీటిలోని చేపలు గూడా నిప్పులమూటలవు తాయట! పురుగులుగూడా ఆఖరికి ఏమన్నాయో తెలుసా? పురుగులుబట్టి పోతార్రా.. అనన్నాయి..!

ఇంతకీ యేమిటటా? ఏదో ఘోరం జరుగబోతోందని– ఊళ్లల్లో ప్రజలు చర్చించుకుంటుంన్నారంట! ఊళ్లల్లో తిరిగే కాకులు విన్నాయట. తాము విన్నటువంటి విషయాలమీద, అవి తొలుత తమలోతాము చర్చించుకున్నాయట. గానీ 'కాకిగోల' అయ్యిందట. అంచేత మిగిలిన సాటిజీవులతో చర్చించదలచి, కాకుల్తో కబుర్లుచేసి పాములమెట్టమీద సభ జరిపేయి. అది తొలిసభ.

అసలు, సభ ఆరంభమే ఎలా జరిగిందనుకున్నారు?

"మన శత్రువులెవరు.."

"మానవులు.."

(ఓలమ్మో.. అని గుండెలమీద చేతులు వేసుకున్నాను)

"..తప్పు, తప్పు, అందరు మానవులూ ఒకటికాదు. మానవులందరు మన శత్రువులుకారు, కొందరే మన శత్రువులు.."

(ఇదేమి తిరకాసని– బుర్రా, పిర్రా గోక్కున్నాను)

"ఔను, కొందరే! ఆ కొందరు.. మానవులు కారు.." ఈసడింపుగా పలికేయి చాలా జంతువులు.

"..అయితే, ఆ కొందరెవరు? వాళ్ళ పేరేమిటి?" ప్రశ్నలొచ్చేయి.

"..గుర్తు తెలియని రాక్షసులందామా.." అడిగేయి తోడేళ్ళూ, చిందువలూ.

"..గుర్తు తెలియని నక్సలైటు అన్నట్టుగా..ఛీ..పోలీసుభాష.." అని విసుక్కున్నాయి జింకలూ, మేకలూ.

"అయితే వాళ్లెవరు? వాళ్ళ పేరేమిటి?"

మళ్ళీ, యీ ప్రశ్నలకే వొచ్చేసరికి, సభకాసేపు నిశ్శబ్దం వహించింది. పక్షులు రెక్కలాడించలేదు, పాములు బుసకొట్టలేదు, నక్కలు ఊళవేయలేదు, చేపలు కదలాడలేదు, చిందువలు, చిరుతలు, ఎలగ్గొడ్లు, గూడకొంగలు, గువ్వలు, పురుగూపుట్ర, సర్వజీవులూ– దీర్ఘాలోచనలో మునిగిపోయేయి.

మానవపోషణలో, పాలనలో జీవించే కోడీ, మేకా, గొర్రే, కుక్కా పశివీ వంటి జీవులూ; కొన్ని పక్షిజాతిజీవులూ తప్పా సృష్టిలోని చాలా జీవులు ఆ సభకు వొచ్చేయి. మానవ పోషణా, పాలనలోనున్న జీవులుగూడా సభకు హాజరవుతామని అభ్యర్థించేయట. గానీ, కోవర్ట్ ఆపరేషన్‌కు పాల్పడతాయేమోనని శంకించి, వాటి అభ్యర్ధనను తిరస్కరించేయట! అయితే, అలా శంకిస్తున్నట్టు వ్యవహరించగూడదనీ, వాటితో స్నేహబంధాలు సాగిస్తూ, మానవసంబంధ వార్తలు సేకరించాలనీ, సభ్యత్వం మాత్రమేలేని సభ్యులు ఆ జీవులనీ సభానిర్వాహక కమిటీ– అన్ని జీవరాశులకూ హెచ్చరించింది! చూడండి, వాటి రాజకీయ చతురత!

సభ కాసేపు నిశ్శబ్దం తర్వాత–

"..మానవపోషణలోని జీవులు వొచ్చివుంటే–మానవులుకానివారెవరో, వారికే పేరు పెట్టాలో, చెప్పగలిగేవి.." అనన్నది, తోడేళ్ళ ప్రతినిధి తోక ఊపుతూ.

తోడేళ్ళకు మానవపోషణలోవుంటే ఎంత బాగున్నోకదా అన్న అభిలాష! అంచేత, తరచూ అవి మానవాసాల వేపు వెళ్తుంటాయి. కోళ్ళకోసమో మేకల కోసమో వొస్తున్నాయని అనీసుకుని మానవులు వీట్ని వెంటతరుముతారు. మా ఆహార, విహారాల ఊసు– మానవులారా, మీకేల? మా సేవలు, మీరు వినియోగించుకోండని, మానవులకెలా నచ్చచెప్పటమా అని వగచుతుంటాయట తోడేళ్లుమా గుణ, గణాలు పుణికి పుచ్చుకున్న మీ సోదరమానవులు కొందరున్నారుగదా, వార్ని చూసైనా మాకవకాశవ్వండని కోరాలనుకుంటాయట!

తోడేలు మాటలకు వెంటనే "..అయితే, మీ జీవిని ఒకదాన్ని, మానవాసాలవేపు పంపి, మానవులు కానివారి గురించి భోగట్టా చేసుకురమ్మను.." అనంది, ఒక కోతి.

"..గొప్ప సలహా యిచ్చేవులే. చూసిరమ్మంటే, కాల్చుకు వొచ్చేజాతి బుర్రకి యిలాటివే తడతాయిలే.." అని కోతిని వెక్కిరించింది ఒక గబ్బిలం, రెక్కల్ని నల్లగా విప్పార్చి, సంస్థలంతటా ఓసారి యెగిరి తిరుగుతూ! గబ్బిలపు ప్రదర్శనకూ, కామెంట్‌కూ కోతులన్నీ నిరనతెలిపాయి. తోకలుండటాన 'యిలా మిగిలేం' గానీ, మేమూ మానవులమే సుమా అని గూడా గర్వించేయి, రెండుకాళ్లమీదా నిల్చొని!

అంతే, యిక సభలో వాగ్వివాదాలు. కొన్ని గబ్బిలాల్నీ, కొన్ని కోతుల్నీ సమర్థించేయి. కాసేపు రభస.సభానిర్వాహక కమిటీ గద్దించీ, బతిమాలీ, రభసను సద్దుమణించేక– ఏ జీవిని పంపుదామని మళ్లా ఆలోచనలో...

కాకుల్లో ఒకదాన్ని పంపితేనో? ఒద్దొద్దు, తిరిగొచ్చి కాకమ్మ కధలుచెప్తాది. జింకనో–మంచిదేగానీ, బతికి బట్టగట్టిరావడం కష్టం. పోనీ పామునో? ఛ..ఛా..దానికి చెవులుండవ్. అదీగాక, పాము నోరువిప్పితే, 'బుస్'మంటుంది, మానవుడా బుస విన్నాడా, దాన్ని బుర్రమీద కొట్టిచంపుతాడు. అయితే, తాబేలో..? మంచిదే, గానీ అది తిరిగొచ్చేసరికి మనమంతా ముసిలోళ్లమైపోతాం...

ఇలా, యేజీవీ మానవావాసాలవేపు వెళ్లి, తమ సాటిజీవాల్తో ముచ్చటించి రాగల అవకాశం లేదని తేల్చుకున్నాయి. చావటానికో, చంపటానికో మాత్రమే మానవాసాలవేపు వెళ్లగలమని అర్థమైంది.

అలా వెళ్లే ఆలోచన విరమించుకుని, యికతామే, తమ మేధాశక్తితో-మానవులు కాని వార్ని, తమ శత్రువుల్ని విశ్లేషించుకోవాలని సభ అభిప్రాయపడింది.

దాంతో, జీవులన్నీ తమ మేధాశక్తిమేరకు, వివరణలూ, విశ్లేషణలూ చేయసాగేయి. ఆ వివరణలూ, విశ్లేషణలూ యెక్కువగా మానవులెవరో తెలియజేస్తున్నాయే తప్పా, మానవులుకాని వారిగురించి తెలియజేయటంలేదు.

పుట్టల్లో పాలుబోయటం, కళ్లంలో పంటగింజల్ని, పశుపక్ష్యాదులకు కొన్ని విడవడం, తమతోపాటు తిండిపెట్టి పోషించటం, తమవెంట తిప్పుకోవటం వగైరా జేసే మానవులగురించీ; ఆహారం కోసమో, విహారంకోసమో, తమను వేటాడే, వధించే మరికొందరి గురించీ వివరించాయిగానీ; ఆ కొందరూ, మానవులే. మానవులు కానివారు కారట! చాలాసేపు, ఈ వివరణలు సభలో జరిగేకా-

"..అసలు వాళ్ల గురించి చర్చించాల్సిన అవసరమేమొచ్చింది? మన బతుకు మనం బతకలేమా?" అని ఒక పురుగు ప్రశ్నించింది.

దాంతో, ఔనౌను, మానవుడెవడో, మానవుడుకాని వాడెవడో, వాడూ వాడూయెలా కొట్టుకుఛస్తారో మనకెందుకు? మన గురించి ఆలోచించండి. వాళ్లనొదిలేసి మన బతుకులు మనం బతకలేమా? యేటి? అనన్నాయి చీమలూ, ఈగలూ, దోమలూ వగైరా క్రిమికీటకాదులు. అందుకు ఒక హంస-

"..బతికీవొచ్చు. గానీ, అదీ ఒక బతుకేనా ఆలోచించండి. మనదీ ఒక బతుకేనా, కుక్కలవలే, నక్కలవలే; సందుల్లో పందులవలే అని ఒక మహానుభావుడు కవిత గూడా రాసేడు. అంతపాటి జంతువులకే అంతమాట అనీసినోడు, పురుగు బతుక్కి యింకెంతమాట అనగలిగీవోడేడో ఆలోచించండి.." అని వయ్యారాలు బోతూ సంశయాన్ని వెలిబుచ్చింది.

"..కుక్కలెలాగూరుకున్నాయో? మహానగరాల్లంటవుండిపోయి బతికిపోనాడు. నాకు దొరకలేదుగానీ, దొరకితే మెడజీవాలు కొరికేద్దును, మా ఊసెందుకెత్తావని.." పళ్లు వెళ్లబెట్టి ప్రతీకారగ్ని కక్కిందో నక్క, మహాకవి మీద. దాంతో చర్చ కాసేపు-కవిత్వం మీదా, మహాకవి మీదా సాగింది. బతికున్నపుడు 'ఈ యుగంనాది' అని తీసేసుకున్నాడు, ఈ సీసా నాది అన్నట్టుగా! చనిపోయి యిన్నాళ్లయినా, యీ సీసా, అతగానిదే అంటన్నారు తప్పా, మరొకళ్లదేమో అనయినా, శంకించకుంటన్నారు అతగాని అభిమానులు.సీసా అతగానిదే, యుగం అతన్ది కాదంటున్నారు, అభిమానుల వ్యతిరేకులు.

ఈ చర్చవల్ల వెంట్రుకవాసి ప్రయోజనం లేదనీ, చర్చ కవిత్వంమీద కాబట్టి యింతవేగం తేలదనీ, కాసేపు కునుకు తీద్దామనుకున్నాయి ఎలుగొడ్లూ, గూడకొంగలూ,

మరికొన్ని సాహిత్య వ్యతిరేకజీవులు. ఈ వాదోపవాదాలకు, తలలు పట్టుకుంది సభానిర్వాహక కమిటీ.

మొదటిసభంతా సక్రమంగా సాగకుండా కొన్ని జీవులు, యిలాగే యేదో ఒక రభస చేసాయి. తొలుత సభలోని జీవులన్నీ- సమాన జాతులు కావని వివాదం లేచింది. ఈ సభలోని కొన్ని జీవులే, మరికొన్ని జీవుల్ని తింటాయి. హింసిస్తాయి, దూషిస్తాయి! మనం-మనలో మనం కాముగాక కామన్నాయి కొన్ని జీవులు. ఔనౌనన్నాయి మరికొన్ని. అటుకొన్నీ, యిటుకొన్నీ జమగూడి వాదనలారంభించాయి

చివరికి, నెత్తీ, నోరూ కొట్టుకొని, అన్న జాతులజీవులనుండీ తగిన నిష్పత్తిలో ప్రతినిధుల్ని ఎన్నుకొని- ఉమ్మడి సమస్యమీద చర్చసాగే షరతుతో తొలి సభను జయప్రదం చేసాయి, నిర్వాహక కమిటీ జీవులు. దాంతో అన్ని జీవులూ, మళ్లీ మానవ వ్యతిరేక కుట్రకు ఐక్యమయ్యేయి.

మూడు మెట్టలమీదా మూడు సభలు జరిగేయని చెప్పాను కదా- ఆ మెట్టలను మీరు చూసివుండరు. అందుకని, వాటి గురించి వివరిస్తాను. మనలో మనమాట, మనిషన్నవాడు తప్పకా చూడాలి. అంత సుందర ప్రదేశం ఈ యిలాకాలో మరొకటిలేదు.

ఆ మూడు మెట్టలకూ - పాములమెట్ట, కాకులమెట్ట, ఎర్రమట్టిమెట్ట అని పేర్లు. పొయ్యిపొక్కళ్లలా, మూడుదిక్కులా ఈ మెట్టలు, క్రోసుడు, క్రోసుడేసి దవ్వులో వుంటాయి. వీటి మధ్యన చిత్తడినేల 'బీల' అంటార్లెండి, దాన్ని. ఈ బీలకీ, యీ మెట్టలకీ వారగా ఎత్తయిన యిసుక దిబ్బలు వాటినావరించి మహాసముద్రం, ఏ దేవుడు సృష్టించినాడో యీ స్వర్గాన్ని..!

ఆకాశంవేపు మోరలెత్తి రైతన్నవాడు, వర్షానికోసం చూడనక్కరలేదు- బీలనీరు, మున్నూరుగాలమూ నేలను తడుపుతుంది. ఇంకోవేపు, దీపాలవెలుగుకి ఉసుళ్లు పుట్టినట్టు. పిత్తపరిగలు, మిట్టగిడుసులు, జల్లలు, బొమ్మిడాలు, నానారకాల చేపలు బీలలోన బిలబిలలాడతాయి. మత్స్యకారులకి వెదకనక్కరలేని ఉపాధి. పేదలుతినే దుంపజాతి మొక్కలు, పేదలు వాడుకొనే తుంగచాప గడ్డీ తరగని సంపద.

పాములమెట్ట మీద రకరకాల పాములేగాక, ఎలుగొడ్లూ, తోడేళ్లూ, చిందువలూ, దుప్పిలూ, ఉడుములూ వగైరా జంతువులున్నాయి. ఏ జాతికి ఆ జాతి విడిపోయి, ఎవరి ప్రాంతాన్ని వారు పంపకాలు చేసుకొని, ఎవరి పేరును వారు తమ ప్రాంతానికి పెట్టుకుందామనీ; పాములమెట్ట పేరుతో కలిసివుండలేమనీ కొన్ని జీవులు ప్రతిపాదించి పోరాడుతుంటాయి. మరికొన్ని జీవులు, ఆ ప్రతిపాదనను తిరస్కరించి, ఆ పోరటాలపై నీళ్లుజల్లి, పాములనామంతోనే సమైక్యంగా ఉందామంటాయి. తేలదూ, మునగదూ యీ వైరం.

రెండో మెట్ట-కాకుల మెట్ట. ఇక్కడ గూడా, కాకులేగాక కొంగలూ, గువ్వలూ, పావురాలూ, పిచ్చుకలూ, వొచ్చీపోయే విదేశీ వలస పక్షులూ వుంటాయి. పక్షులేవీ

ప్రాంతనామం గురించి వైరం లేవదీయలేదు.

మూడోది ఎర్రమట్టిమెట్ట! ఇక్కడ, జంతువులూ, పక్షులూ తక్కువ సంఖ్యలో ఉంటాయి. ఎక్కువగా వివిధరకాల ఔషధ మొక్కలుంటాయి. ఇవి తమ మెట్టకు ఏ జంతువుపేరో, పక్షిపేరో గాకుండా మట్టిపేరు ఉన్నందుకు మట్టిని ముద్దాడి, మురుస్తాయి.

పిలిస్తే, పలికే దవ్వులో సముద్రం! బీల! దానికెగువన పచ్చని పంటభూములూ, ఆ భూములకు నీళ్లందించే మహేంద్రతనయ నదీ. ఆకుపచ్చ అరటీ, కొబ్బరీ, మునగా తోటల నడుమ ఊళ్లూ..! ఊళ్లుగావవి, ఉద్యానవనాలు!

అటువంటి, ఊళ్లల్లో తిరిగే కాకులు ఈ కుట్రకు మూలపురుషులు (మూల కాకులనండిపోనీ..)! సభలో వివాదాలు సద్దుమణిగేక–

"..మన మూడుమెట్టల మధ్యనగల బీలభూమికి ఆనించివున్న భూభాగంమీద, అదేదో కంపెనీ, అదేదో పెద్దకర్మాగారం నిర్మిస్తాదట.." సభముందు విషయాన్ని పెట్టాయి కాకులు.

"మంచిదేగదా? కంపెనీ ఉద్యోగులొస్తారు, మీ కాకులకు మరికొన్ని ఎంగిలి పళ్లేలు ఎక్కువ దొరుకుతాయి. కంపెనీ బిల్డింగులు గడతాది. మీలాగే మరికొన్ని పక్షులు వాటిల్లో నివాసముండొచ్చు, గూళ్లుగట్టే బెడదుండదు, పిట్టాపిచుకలు– ఏసీ బిల్డింగుల్లో తిరగొచ్చు. మంచిదే.." కొత్తను ఆహ్వానించే ఒక జింక తన అభిప్రాయాన్ని చెప్పింది.

"..మనుషులూ అలాగే అనుకున్నారట. కంపెనీలో ఉజ్జోగాలొస్తాయి, భూములకి ధరలు పెరుగుతాయి, హోటల్లూ, లాడ్జింగులూ, రకరకాల బిజినెస్‌లు చెయ్యొచ్చు, రాబడులు పెరుగుతాయని అనుకున్నారట. కొందరు భూముల్ని అమ్మకమూ జేసారట, కంపెనీకి. ఇంకోపక్క గవర్నమెంటువారేమో బీలప్రాంతాన్ని కంపెనీకి చవగ్గా యిచ్చేరట. కంపెనీవోరు, లారీలూ, ట్రక్కర్లూ, ప్రొక్లెయినర్లూ తీసుకొచ్చి పనులారంభించారట. ఈలోగా, యెవులో వొచ్చి– అయ్యో రైతులారా, అయ్యయ్యో కూలీల్లారా, అయ్యలారా, అమ్మలారా... చెప్పలేదని అనగలరు మీరు, చెప్పుతున్నాము వినండి. కంపెనీ కాదది, మీ పాలిట కాలయమపాశం.. అనన్నారట.." అని చెప్పి, గుక్కతిప్పుకోడానికి ఆగింది కాకులప్రతినిధి.

"..ఎవురు? చెప్పలేదని అనగలరని ఎవురు చెప్పారు.." యేదో కథ విన్నట్టుగా, ఆసక్తిగా విన్న ఉడుత ఉత్సుకతతో ప్రశ్నించింది.

"..ఇంకెవరు? కమ్యూనిస్టు మానవులయివుంటా"రంది, బుసగొడుతూ పాము

"..కమీనిస్టులు చెబితే, జనం నమ్ముతారా, యింకానూ.." అని ఆశ్చర్య బోయిందో నక్క "..నక్కల మాటలు కోళ్లూ, పాముల మాటలు కప్పలూ, పులుల మాటలు గోవులూ.. యినడంలేదా? అలగే మానవులున్నూ.." అనంది ఒక ఎలుగుబంటి, ఒంటిమీది వెంట్రుకల్ని కదిలించుతూ.

ఆ మాటకు నక్కలూ, పాములూ ఎలుగుబంటి తగువుకు దిగేయి. సభా నిర్వాహక

కమిటీ బతిమిలాడి, వాట్ని ఊరుకోబెట్టాయి. ఆ తర్వాత కాకులప్రతినిధి మళ్లీ చెప్పటమారంభించింది..

"మానవులుగూడా.. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మగూడదో తేల్చుకోలేక సతమతమయినారట. కమీనిస్టులూ, కొన్ని పత్రికలూ, కొన్ని టీ.వీ.లూ కంపెనీవోళ్ల నష్టమనేవట. మరికొన్ని పార్టీలూ, పత్రికలూ, ఛానల్లూ.. కంపినీవోళ్ల లాభమననేవట. జిల్లా కలెక్టరయితే.. విహారయాత్ర పేర పర్యాటక ప్రాంతాలకు ప్రజలను తీసుకెళ్లే యేర్పాట్లు చేసాడట. యాత్రలూ, విందులూ వినోదాలూ.! యింకో ప్రక్క కంపెనీవారు, గ్రామాల్లో వైద్యశిబిరాలూ, పాఠశాలలకు బెంచీలూ, కుర్చీలూ, తాగునీటి సదుపాయం చేసేవారట. ఏటిది? మనబతుకుగానీ మారిపోతందా, దశగానీ తిరిగిపోతందా.. అని నజ్జుగుజులు పడ్డారట, కొంతమంది ప్రజలు. కొంతమందేమో పెళ్లినాటి మాటలు, యేనాళుకి ఉండవన్నారట. రోజూ ఊళ్లంట యివే చర్చలట. ఔనని కొందరూ, కాదనికొందరూ.

కంపెనీమాత్రం తనపని తాను చేసుకుపోతోందట. కొసకి, యిలాక్కాదు, మనకేది మంచో, యేది చెడో తెలీటంలేదు, యిలాంటి కంపెనీ.. యింకొక్కాడ వుందటకదా? అది చూసొద్దామని.. జనాలు నిర్ణయించారట.." అని చెప్పింది కాకులప్రతినిధి.

సభ జాగ్రత్తగా విన్నది. కాసేపు యే జీవి మాటాడలేదు. ఒక ఫెలికాన్ పక్షిమాత్రం "..ఎప్పుడు బయల్దేరతారు?" అనడిగింది. ఆ పక్షి విదేశీపక్షి. ఎక్కడో సైబీరియా నుంచి యిక్కడకు యేటా కార్తీకానికి ముందువొచ్చి, ఛైత్రానికి మళ్లీ తిరిగి వెళిపోతాయి.

ఈ పిట్టముండకి ప్రయాణమంటే సరదా! మానవులతోటి యిదిగూడా యెళ్దామంటాదా, యేటి.. కొంపదీసి..? అనుకున్న ఒక తాబేలు దానివేపు చూస్తూ అడగనే, అడిగింది– ఎందుకూ అని?

అప్పుడా విదేశీ పక్షి, అన్ని జీవులవేపూ చూసి–

"..నాకైతే లోకమంతా తెలుసు. ఈ రెక్కలతోటి యెగిరి, యీ కళ్లతోటి చూస్సేను. కానీ యిక్కడి చాలా జీవులకి నుయ్యే సముద్రం, గూడే వైకుంఠం, కడుపే కైలాసం. లోకగ్యేనం తక్కువ. అందుకని, ఒకవేళ నేను చెప్పినా.. యీ జీవులు నమ్మవు. ఆ మానవులలాగ వెళ్లి చూసొస్తే మంచిదని నా అభిప్రాయం. అందుకని మానవులు ఎప్పుడు బయల్దేరతారడిగేను.." అనంది.

"..కడుపుజరక్క, దేశబికారి తిరుగులు తిరిగి నోళ్లకున్న గ్యేనం.. మనకెలాగుంతాదిలే.." ఎకసెక్కమాడిందో కప్ప.

కప్ప బెకబెకలను పట్టించుకోలేదు సభ. కానీ, మానవులకు జరిగే లాభనష్టాలు.. తమ జీవరాశికి వర్తిస్తాయా? తమపై కంపెనీ ప్రభావం వేరుగా వుంటుందా? ప్రశ్నలొచ్చేయి. వయసురీత్యా అనుభవమున్నవీ, వివిధ ప్రాంతాలు తిరిగినవీ.. తమ అనుభవాల్ని చెప్పుకొచ్చేయి...

మానవుడు విజ్ఞానం పెరిగేకొద్దీ, ప్రకృతిమీద అజమాయిషీ చేయగలుగుతున్నాడు. తనకి కావలసినట్టు ప్రకృతిని మలుచుకుంటున్నాడు. ఒక్కొక్కచోట ప్రకృతిని తిరిగి సృష్టించుకుంటున్నాడు... అలా; గతంలో కనీవినీ ఎరుగని సంపదల్ని ప్రకృతినుంచి తీయగలుగుతున్నాడు. ఇక్కడేకాదు, ప్రపంచంలోన చాలాచోట్ల నడిచే వ్యవహారమిది... ఇలా, చెప్పుకొచ్చేయి.

అవి విన్న జీవుల్లో, ఒక అడవిమేక

"..యేదీ, మానవుడి సైన్సుతోటి.. ఒక సముద్రాన్నీ, ఒక నదినీ, ఒక బీలనీ, ఒక పంటభూమినీ సృష్టించమను..చూద్దాం.." అనడిగింది.

"మానవులుగూడా కొందరు నువ్వన్నమాటే అడిగేరు, కానీ అభివృద్ధి పేరుతో వారి వాదనను కొట్టేస్తున్నారు." అని చెప్పింది ఫెలికాన్ పక్షి. "..ఎవరా వాదనను కాదనేవాళ్లు..?" అడిగిందొక జింక

"...వాళ్లే మానవులు కానివాళ్లు.." జింకవేపు ప్రేమగా చూస్తూ చెప్పిందో చిందువ.

జింక, దాని కళ్లకు కనబడకుండా, గుబురుగాగల మొగలిడొంకల వెనక్కు వెళ్లింది. మానవులు కాని వాళ్ల దుర్మార్గంనుంచి రక్షణ లేదా? అని చాలాసేపు జీవులన్నీ ఆలోచించి, తాముగూడా మానవులతోపాటు పరిశీలనకు వెళ్లాలని నిర్ణయించేయి. అలా పర్యటనకోసం ప్రతీ జాతి జీవరాశినుండీ రెండేసి జీవులను ప్రతినిధులుగా ఎన్నుకొన్నాయి. పర్యటన తర్వాత సమావేశ తేదీని గూడా నిర్ణయించుకుని.. మొదటి సభ చాలించాయి.

× × ×

ప్రతినిధిబృందం– ఒక కార్మగార ప్రాంతాన్ని చేరింది. పొగలుగక్కే కర్మాగార కొలిమీ, అది వెళ్లగక్కే బూడిద, కర్మాగారపు విసర్జాలు కలిసే జలవనరులూ– అన్నిటినీ పరిశీలించినాయి. ప్రవహించే స్వచ్ఛమైన నదీజలాలుగానీ, పచ్చనిపంటచేలుగానీ, తోటలుగానీ కన్పించలేదు. ఈసురోమనే ప్రజలు..ఊళ్లల్లో! తమ సహచర జీవరాశికోసం వెదికింది బృందం తొలిరోజంతా యే జీవి కనిపించలేదు.

కర్మాగారం చేసే ధ్వనికి– పిట్టగుండెల పక్షులు యెటోదూరంగా వెళ్లిపోయేయి. కర్మాగార నిర్మాణపనుల్లో– పాములూ, జెర్రిలూ, పురుగూపుట్రా చాలామట్టుకు యంత్రాల కింద నలిగి చనిపోయేయి, మిగిలినవి బతుకుజీవుడా అని వలసబోయేయి. జింకలూ, కుందేళ్లూ, అడవిమేకలు వంటివి.. కంపెనీ సిబ్బందికి ఆహారమవడమో, పెంపుడు జీవులుగావటమో జరిగింది.

వెదగ్గా, వెదగ్గా కొన్ని జీవులు కన్పించాయి. వాట్ని పలుకరిస్తే.. తొలుత కన్నీరు పెట్టుకున్నాయి. తర్వాత మొర్రోమని విలపించాయి. తర్వాత–

"..గూళ్లు పోయేయి, చెట్టూపుట్టా, తుప్పాడొంకా పోయేయి. నదులు లేవు, కొండాకోనలులేవు, పంటభూములులేవు. తినడానికి ఆహారం దొరకదు. తాగడానికి నీరు

దొరకదు. సావలేక బతకతన్నాం! ఆ కర్మాగార భూతం కదిల్తే పెనుకూత. కక్కితే కాలకూటవిషం! అది యేటి తయారుచేస్తందో, యెవురికి అమ్ముతందో తెల్దు. ఇక్కడ- వొకమనిషికిగానీ, వొక పక్షికిగానీ, జంతువుకిగానీ, కీటకాది జీవరాశి దేనికిగానీ- పిసిరంత మేలు జరగలేదు..! భగవంతుడా.. ఎక్కడ బతకాలని దేవుడ్ని అడగాల..గానీ, అతగాడు అగపడతాడా?" అనన్నాయి.

ఇంచుమించుగా, మానవులకి గూడా ఈవిషయాలే తెలిసాయట. కంపెనీ యిచ్చిన నష్టపరిహారాన్ని యితరేతర ఖర్చులకింద పోగొట్టుకున్నోళ్ల సంగతలా వుంచినా, పరిహారంతో మరోచోట బతకడానికి సరిపడా భూమిగానీ, యిల్లూవాకిలిగానీ దొరకక త్రిశంకు స్వర్గం తీరయ్యిందట కొందరికి. ఉపాధిపోయింది. పోనీ, కంపెనీ నౌకరీ యిస్తాదని చూస్తే.. వాచ్‌మేన్‌లూ, గార్డులూ, వాటర్‌బోయ్‌లూ తప్పా మరో పనికి, పనికిరాని జనాలని అనేసారట. పంటభూముల్లోకి కంపెనీ బూడిద యెగిరి పంటలు పాడవుతున్నాయట. నీటివనరులన్నీ- కర్మాగారం వొదిలే మొలాయిస్ చేరి కలుషితమై నానారకాల జబ్బులూ వొస్తన్నాయట. పేదరికంతో, జబ్బుల్తో, ఉపాధిపోయి, ఈసురోమంటున్న జనాలే కన్పించారట.

× × ×

ఈ విషయాలన్నీ రెండోభలో చర్చించాయి. రెండోసభ పాములమెట్ట మీద జరిగింది. కొంతసేపు యేజీవీ నోరు విప్పలేదు, అన్నీ విచారంగా కూచున్నాయి. కాసేపటికి, ఫెలికాన్‌పక్షి లేచి, రెక్కలుకొట్టుకొని సభాస్థలంతా తిరిగి, సభమధ్యలో నిల్చుని-

"..ఈ దేశంలో యిది కొత్త. కానీ యిప్పటికే చాలా దేశాల్లో యీ ఘోరకలి జరిగిపోయింది. అక్కడ మానవులకూ. మానవేతర జీవరాశికీ యిపుడు జ్ఞానోదయం కలిగిందిగానీ, చేతులుకాలేక ఆకులు పట్టుకున్న చందమైంది. అటువంటి దేశాల్ని చూసైనా యీ దేశం మేల్కోవాలి. ప్చ్ ..కానీ, అలాగలేదు.." అని విచారాన్ని వెలిబుచ్చింది.

ఒక ముదుసలి జంబూకం సుదీర్ఘమైన నిశ్వాసవిడిచి, సభనంతట్నీ చూసి-

"..మనదేశంల యిలాంటి బుద్ధులున్న మానవులు లేరనికాదుగానీ తక్కువ. మనిసిగానీ, మతంగానీ, రాజ్యంగానీ.. జీవహింస నేరమన్న నేలయిది. పాములకు పాలుబోయటం, పిట్టలకు గింజలు జల్లటం, చాలా జంతువుల్ని పెంచుకోవటం.. దేవతలుగా జంతుజాలాన్ని పూజించటం.. యీ దేశంల అలవాటు. మట్టిని తల్లిగా పూజించే మనుషుల దేశమిది. ఇపుడెందుకిలాగ మారిపోతంది..." వాపోయింది.

"..అదంతా అజ్ఞానమనే వాళ్లు బయల్దేరారు.." బుసగొట్టిందో పాము

"..అది అజ్ఞానమైతే యిది అతిగ్యేనం. అతి తెలివి, వినాశనానికే దారితీస్తాదిలే. మన ఉసురూ, మట్టి ఉసురూ వొట్టినిపోదు.." శాపనార్థాలెట్టిందో పిల్లి.

అయితే యిపుడేం చేద్దాం? చాలాసేపు, తలా ఒక రీతిలో తర్వాతి కార్యక్రమంగుర్చి మాటాడేయి. కొన్ని- మనమేం చేయగలం, ఏం జేసినా మనుషులే

చేయాల.. వాళ్లకి సపోర్టుగా కావలిస్తే నిలబడదామనన్నాయి. మరికొన్ని- మనిషేమీ చేయకపోతే మనం చేతులు కట్టుకు కూచుంటామా? మనశక్తిమేరకు మనం పోరాడమా? పోరాడితేపోయేదేమీ లేదన్నాయి. ఇంకొన్ని-మనశత్రువులెవరు, వారి బలాలేమిటి అని ఆలోచిస్తే- మన శత్రువులు చాలాశక్తి సంపన్నులనీ, వారితో పోరాడాలంటే, సాయుధమవ్వాలనీ, గెరిల్లాపద్ధతుల్లో పోరాడాలనీ, మనకు మన దేహంలోనే ఆయుధాలున్నాయనీ, రహస్యపోరాటం చేయాలనీ నినదించేయి.

చివరికి, సభ అన్ని జీవుల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకొని ప్రస్తుతానికి, కంపెనీకి వ్యతిరేకంగా ప్రజలు యే పోరాటంచేస్తే, ఆ పోరాటానికి మద్దతుగా, ప్రచ్ఛన్నంగా మనం సహకరిద్దామనీ, తర్వాత దశలో యే పోరాటరూపాన్ని చేపట్టాలో ఆలోచిద్దామనీ, అవసరమైన సమయంలో మూడోసభ ఎర్రమట్టి మీద జరుపుదామనీ నిర్ణయించి సభ చాలించాయి.

× × ×

కంపెనీకి వ్యతిరేకంగా, ప్రజలు తొలుత ఊరేగింపులూ, సభలూ జరిపేరు. కరపత్రాలు పంచేరు. ఇదన్నమాట, వీళ్లపోరాటమని, కొన్ని జంతువులు విసుగుచెందాయి. పోరాటం తీవ్రరూపం తీసుకున్నపుడు, తమ సహకారమందిద్దాములే అనుకుని, అంతదాకా మన బతుకు మనం బతుకుదామనుకుని కొన్నిజీవులు ఆ పరిసరాలనుంచి వెళిపోయేయి. కానీ, మరికొన్ని జీవులు మాత్రం, ఆ పరిసరాల్లో తిరుగుతూ, ఎవరికీ అనుమానం రాకుండా ప్రజల పోరాటానికి సహకారన్నందించేవి.

ఒకసారి ప్రజలు, కలెక్టరేట్‌కి ఊరేగింపు తీసేరు, యీ జీవులు గూడా పాల్గొన్నాయి. కలెక్టర్‌గారు, అభివృద్ధిని అడ్డుకోవద్దన్నారు. ఒకజోరీగ- అభివృద్ధంటే, యేటని చెవిదగ్గరగీపెట్టింది. కలెక్టర్ చిరాగ్గా చూసేరు. బిళ్లబంట్రోతు తన చేతిలోని దండంతో జోరీగను కొట్టబోయేడు, జోరీగ యెగిరిపోయింది, దండం కలెక్టర్‌గారి కుడిదవడను ముద్దాడింది. ప్రజలు...దాసుని తప్పులు దండంతో సరి.. అని పాటందుకున్నారు. పోలీసులు, కలెక్టర్‌గారిని ఆఫీసులోకీ, బంట్రోతుని విచారణకూ తీసుకువెళిపోయేరు. ప్రజల్ని ఆఫీసునుంచి తరిమేసారు.

ఆ తర్వాత, ప్రజలు నిరాహార దీక్షాశిబిరం వేసారు. తగు రక్షణలో యీ జీవులుగూడా శిబిరంకి దగ్గరలో గుమిగుడేయి. పోలీసులు- రోజూవొచ్చి, శిబిరంలో కూర్చొనే ప్రజల పేర్లను రాసుకునేవారు. ఎందుకో బోధపడేదిగాదు, యీ జీవాలకు. ఒకరోజు, ఒక గ్రద్ద పోలీసులు రాసే కాయితాలను ఎత్తుక పోవజూసింది. పోలీసులాఠీ దెబ్బకు దొరికిపోయింది. అప్పుడు- జీవితంలో పోలీసు నంజికొడుకు లాఠీకి దొరకగూడదని దానికి బోధపడింది. ఇంకోరోజు, ఎవరో నాయకుడు, ఏవేవో వాగ్దానాలు చేయబోతే, ప్రజలు... కంపినీవేపా, తమవేపా తేల్చిచెప్పమన్నారు. ఆ నాయకుడు, తేలా, మునగకుండా యేదేదో

చెప్పబోయేడు, అప్పుడు వందలాది నల్లులు ఆ నాయకుని చొక్కాలో దూరి గొలకసాగేయి. ఆ నాయకుడు చొక్కా దులుపుకున్నా ఫలితంలేకపోవటంతో, చొక్కా విప్పేసుకున్నాడు. ప్రజలు.. ఓఓఓ అని నోళ్లమీద అరచేతుల్తో శబ్దాలు చేసారు. మరొకరోజు ప్రజలు బంద్ నిర్వహించేరు. ఈ జీవులు గూడా రోడ్లను కాసేయికొన్ని. నక్కలూ, చిందువలూ, ఎలగ్గొడ్లూ వంటివి దోవలు కాసేయి. గుడ్లగూబలూ, గ్రద్దలూ, తొండలూ వంటివి దుకాణాలకు వేలాడేయి.

చూసేరుగా, ఇవేవీ మానవులకు తెలీవు. పోలీసులకు తెలీవు. రహస్యంగా, కుట్రతో సాగించేయవి. రోజులు గడుస్తున్నాయి, ప్రజలు విసుగూ, విరామంలేకుండా పోరాటం సాగిస్తున్నారు. కంపెనీ గూడా తనపని తాను చేసుకుపోతోంది. మట్టిని దవ్వుతోంది, లారీలను తిప్పుతోంది, బీల మీద కన్నేసి, చుట్టూరా భూమిని చదును చేయదలచింది.

యిదింతవేగం తేలదని- చాలా జీవులు చిరాకుపడ్డాయి. ఏ క్షణాన, ఎవరు రాజీపడతారో చెప్పలేమన్నాయి. రాజీపడితే మన సంగతేటని ప్రశ్నించుకున్నాయి. మూడోసభ జరపాలని ప్రతిపాదించేయి.

ఇంతలో, కొన్ని కాకులు తాము సేకరించిన సమాచారాన్ని సహచరులముందు పెట్టాయి- "రేపో, ఎల్లుండో బీలకు ఆనించిన పంటభూమిచుట్టూ కంపెనీవారు కంచెగడతారట. గ్రామాల ప్రజలనెవరినీ ఇక యీ బీలలోకి రానివ్వరట. పోలీసులు గూడా.. నిషేధాజ్ఞలు విధించేరట..! చేపజీవి తిరుగాడే బీలలోన- కంపెనీ వ్యర్థాన్ని ఒదలటానికి టాంకులు గడతారట. ఆ వ్యర్థాలుగానీ బీలనీటిలోన కలిస్తే, ఒక్క చేపగూడా బతకదు..." అని చెప్పాయి. చేపజాతంతా.. కన్నీరుమున్నీరయ్యేయి.

"..బీల వొక్కటేకాదు, మన మూడు మెట్టలనీ కంపెనీవారు తమ కర్మాగారం కోసం వాడుకుంటారట. ఏ జీవరాశీ వుండదు. మొక్కా, మోడు వుండవు, మట్టీ, మెట్టా యేవీ వుండవు.." దుఃఖపుగొంతుతో పలికిందో అడవిమేక.

మూడోసభ జరిపితే బాగుణ్ణేమో అనన్నాయి కొన్ని జీవులు. కాకపోతే, సభ జరపాల్సిన నాయకజీవులు అందుబాటులో లేవు. అప్పుడే అక్కడకు వచ్చిన మరికొన్ని కాకులు ఒక విషయాన్ని చెప్పాయి- రేపో, ఎల్లుండో కంపెనీవారు బీల చుట్టూ కంచె గాని కడితే ప్రజలు, దాన్ని వ్యతిరేకిస్తామంటన్నారు. తాడోపేడో తేల్చుకుంటామంటన్నారు. ఏదో గొడవ జరిగేట్టుగా వుంది.. అని చెప్పాయి. అయితే, తప్పకా సభ జరుపుకోవాలి మనం.. అనన్నాయి మిగిలిన జీవులు. దాంతో నాయకుల్ని కలసి సభ ఏర్పాటుకోసం కబురందించడానికి బయలుదేరాయి.. కాకులు!

× × ×

అక్కడకు మూడురోజుల తర్వాత, ఎట్టకేలకు, మూడోసభ ఎరమ్రట్టి మీద జరిగింది. రెక్కలు తెగిన పక్షులూ, తోకలుతెగిన పాములూ, గాయపడిన జంతువులూ

కొన్ని ఆ సభలో కన్పించేయి. ఖచ్చితంగా, అవి, కంపెనీకి వ్యతిరేకంగా పోరాడే ప్రజల్తోపాటు పోరాడడమో, దగ్గరగా ఉండి గమనించాలనుకోవడమో చేసివుంటాయి, అంచేతే ఆ గాయాలు. లేకపోతే, ఎవరండీ వాట్ని గాయపరుస్తారు? అసలుకి, కంపెనీ కంచె నిర్మించబోవటానికి రెండు రోజులు ముందునించే, పోలీసులు ఆ ప్రాంతంలో ప్రజలెవరూ సంచరించరాదని నిషేదాజ్ఞలు జారీచేసారట. గ్రామాల్లో మైకులద్వారా ప్రచారంచేసారట. అయినా ప్రజలు పోలీసుల ఆజ్ఞల్ని ధిక్కరించి, ఆడా, మగా, ముసలీముతకా, పిల్లాజెల్లా.. గుంపులు గుంపులుగా బీలను చేరుకున్నారట. ఈ జీవరాశి గూడా గుంపులుగా అక్కడికి చేరుకున్నాయట. బీలభూమిని ఆనించి పచ్చని పల్లపు భూముంది. దాన్ని చదునుచేసి, కంపెనీ ఉద్యోగులూ, పోలీసులూ దానిలో టెంటు వేసి కూర్చున్నారట. బయటి ప్రాంతంనుంచి కూలీలను రప్పించారట, వాళ్లతో కంచె నిర్మాణం పనిని ఆరంభించడానికి పరిసర గ్రామాల ప్రజలు ఆ బీలభూమికి చుట్టూగల తోటలూ, మెట్టలూ, పొలాల్లో కాపుకాసేరు. చూపుకి అందినంత దూరంలోన యిరువర్గాలూ వున్నాయి. కాకులు కొన్ని అటూ, యిటూ యెగిరి పరిస్థితిని కనిపెడుతున్నాయి. ఎందుకైనా మంచిదని కొన్ని జలచరాలూ, ప్రాకే ప్రాణులూ బీలలోన యుద్ధానికి సిద్ధంగా వున్నాయి. మరికొన్ని జీవులు ప్రజలకందుబాటులో వున్నాయి. ప్రజలకు కావలసిన సరంజామా అందివ్వటానికట.

పొద్దుచద్దన్నాల వేళదాటింది. ఎండవేడి ఒంటికి చురుక్కుమన్పిస్తోంది. కాకీబట్టలూ, కంపెనీ యూనిఫారాలూ వేడెక్కాయి. అధికారుల ఆజ్ఞకోసం ఎదురుచూస్తున్నారు. పని ఆరంభించడానికి. ఇంతలో ఎటునిండొచ్చాయో మూడునక్కలు, ఊళగూడా వెయ్యకుండా పరుగెత్తుకొచ్చి టెంటులో దూరేయి. అటుదిప్పి, యిటుదిప్పి ఆ నక్కలు, అక్కడి వార్ని టెంటు బయటికి పరుగెత్తించాయి. ఈలోగా ఒక ఆడమేకా; దాన్ని వెంబడిస్తూ.. మే..మ్మే.. అనరుస్తూ ఒక మగమేకా; రెండూ టెంటులోకి చేరాయి. వాటి శృంగారాన్ని ఆటంకపరుస్తూ, కంపెనీ ఉద్యోగులు కర్రలు దీసేరు. ఆ అడవిమేకలు, యీ మానవులుకాని వారిని దూషించుకుంటూ అక్కడనించి దూరంగా పరుగెత్తాయి. ఇంతలో గుంపుగా కొన్ని గూడకొంగలు ఆ టెంటులోకి దూరి, కొంగభాషలో పద్యాలు పాడసాగేయి. వీటి రాగాలకు మరికొన్ని చిలుకలూ, గోరింకలూ, ఫెలికాన్‌పక్షులూ చేరి బృందగానం ఆరంభించాయి.

పోలీసులూ, కంపెనీ ఉద్యోగులూ.. వారి భాషలో యీ జీవరాశిని దూషించసాగేరు. అప్పుడే, జీవుల్లో అధికారులొచ్చేరు. అనుజ్ఞ యిచ్చేరు. కంచె ఆరంభించబోయేరు కూలీలు. కాపుగాసిన ప్రజలు మూకుమ్మడిగా వొచ్చిపడ్డారు. తోపులాట, వాగ్వివాదాలు జరిగేయి. కంపెనీ ఉద్యోగులు టెంటులో తాము దాచిన కర్రలను తీసేరు. పోలీసులు తమ చేతుల్లోని లాఠీలను తీసేరు. పోలీసులూ, కంపెనీ మనుషులూ కలసి, దొరికిన వార్ని దొరికినట్టు బాదేరు. ఆడా, మగా, ముసలీ, ముతకా అని చూడలేదు. దెబ్బలు కాసేసారు ప్రజలు. అయిపోయిందిలే,

మొర్రోకిర్రో మనుకుంటా పోతార్లే అనుకుంటాంగదా? గాని, అలా జరగలే. దెబ్బలు కాసినోళ్ళకి బుద్ధిరాలేదు, అది చూసిన మిగిలినవారికీ బుద్ధి రాలేదు. అళ్లు, మనలాటి మనుషులుకారు. చుట్టూచూసేరు, సర్వేతోట కన్పించింది., అంతే, కర్రలు తీసేరు, తిరగబడ్డారు. ఏటయ్యిందో.. యిద్దరి రైతుల ప్రాణాలు గాలిలో కలిసిపోయేయి. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపామంటారు..

అదిచూసి, యీ జీవులు కొన్ని పోలీసులమీదా; కూలీలమీదా దాడికి దిగేయట. ప్రజల్నే పిట్టల్ని కాల్చినట్టు కాల్చే మాతో పెట్టుకుంటారా అని రెక్కల్ని విరిచిపారేసారట పోలీసులు. కొన్ని జీవాలకు ఎముకలు గుల్ల జేస్సారట. కొన్నింటికి వెన్నుపూసలు విరిచేసారట. ఛ..తప్పయిపోయింది, సాయుధంగా రావాలసిందని విచారించాయట, ఆ జీవులు..

అలా, ఆ యుద్ధరంగంనుంచి, వెనుదిరిగిన జీవులు, వెంటనే ఎర్రమట్టిమీద సభకోసం పిలుపునిచ్చేయట. అదిగో, అలా.. మూడోసభ ఎర్రమట్టిమీద జరిగింది.

మూడోసభ ఆరంభమే యుద్ధనాదాల్తో జరిగింది. ఇక క్షణకాలం గూడా మన జీవరాశి ఆగకూడదని అరిచేయి. కొన్ని జీవులు అప్పటికే సాయుధమై వొచ్చేయి. కొన్నింటికి ఆయుధాలు వాటి అంగాల్లో భాగంగా వుంటాయికదా? ఆ క్షణమే యుద్ధాన్ని ప్రకటించేసాయి. యుద్ధం-ఎన్ని విధాలా, ఎన్ని దశల్లో, యే ఎత్తుగడల్తో, ఏ వ్యూహాల్తో చేయాలో నిర్దేశించుకున్నాయి. అవి ప్రకటించుకున్న యుద్ధం ఒక కంపెనీతో, ఒక ప్రభుత్వంతో, ఒక మనిషితో కాదట! వాటి శత్రువులు అనేకులట.

ఎవరివలన జలవనరులు యింకిపోతాయో, ఎవరివలన భూగర్భంలోని ఖనిజసంపద ఖాళీ అయిపోతుందో, ఎవరివలన నదులూ, సముద్రాలూ, పర్వతాలూ, పంటభూములూ. పల్లెలూ విధ్వంసమవుతాయో- వారందరూ శత్రువులేనట! వారిమీద యుద్ధమట!

గొంతులు పూరించేయి, శరీరాలు సంధించేయి, సకలచరాచర జీవరాశీ సమరానికి కదిలింది. ఒక పెనుశబ్దమేదో నన్ను భయపెట్టింది. గుండెలరచేత్తో పట్టుకొని మానవావాసాలవేపు పరుగుతీసేను... వాటికంటే ముందుగా యీ కుట్రను గురించి మానవులకు హెచ్చరిద్దామని!

గానీ, నా దురదృష్టం..! మానవావాసాలు ప్రేతాత్మల ప్రవేశాన్ని నిషేధించేయిగదా? గ్రామపొలిమేరల్లో గ్రామదేవతలను రక్షణగా నిలిపేయిగదా? అవి మాకు శత్రువులుగదా?

అంచేత, యీ కథ..యిలా పొలిమేరలలో జారవిడుస్తున్నాను. ఇది మానవేతర జీవరాశి కంటబడకుండా జాగ్రత్త పడవలెను. ఎవరికంట బడుతుందో? ఏమిటో..?

+++ +++ +++

పాలపిట్ట కథల సంపుటి 2011